సీజనల్ వ్యాధులతో అప్రమత్తం

- చిన్నపాటి ఆరోగ్య సూత్రాలు పాటిస్తే సరి
- జ్వరం వస్తే అశ్రద్ధ చేయొద్దు
- తాగునీటి విషయంలో నిర్లక్ష్యం వద్దు
- పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత ముఖ్యం



దోమల నిర్మూలనకు గ్రామాల్లో తీసుకుంటున్న పారిశుద్ధ్య చర్యలు

కృత్తివెన్ను: ప్రస్తుతం వర్షాలు పడుతున్నాయి. అధికశాతం ఎక్కడ పడితే అక్కడ నీటి నిల్వలు ఉంటున్నాయి. వీటి వల్ల దోమల వ్యాప్తితో పాటు రోగ కారక క్రిములు పెరిగి ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇటువంటి సమయంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. చిన్నపాటి ఆరోగ్య సూత్రాలు పాటిస్తే చాలు వ్యాధులను దరిదాపునకు రాకుండా చూడొచ్చని చెబుతున్నారు. ఇప్పుడు సాధారణంగా వచ్చే వ్యాధుల విషయంలో జాగ్రత్తలను కృత్తివెన్ను పీహెచ్‌సీ వైద్యుడు సాయిసందీప్ వివరించారు.

ఈ సీజన్‌లో వచ్చే వ్యాధులు...

వర్షాకాలంలో అధికంగా నీరు కలుషితమవుతుంది. సరైన జాగ్రత్తల నడుమ తాగునీటిని ఉపయోగంచకపోతే ముఖ్యంగా టైఫాయిడ్, డయేరియా లాంటి వ్యాధులు వస్తాయి. మురుగునీటి నిల్వలు పేరుకుపోవడంతో దోమల వ్యాప్తి వల్ల డెంగీ, మలేరియా వ్యాధులు కూడా అధికంగా వచ్చేందుకు అవకాశం ఉంది. ప్రజలు ఈ సీజన్‌లో కాచి చల్లార్చిన నీటిని తాగాలి. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధుల విషయంలో మరింత శ్రద్ధ తీసుకోవాలి.

డయేరియా లక్షణాలు...

నిల్వ ఉంచిన వంటకాలను తినడం, అధికంగా మాంసాహారం తీసుకోవడం, కలుషిత నీరు తాగడం, రోడ్ల వెంబడి ఏమాత్రం సురక్షితం కాని తినుబండారాలు తినడం వల్ల డయేరియా వ్యాధి సోకే ప్రమాదం ఉంది. ఈ వ్యాధి సోకితే అధికంగా నీళ్ల విరేచనాలు, వాంతులు, కడుపులో నొప్పి, జ్వరం, నీరసం ఆకలి లేకపోవడం, కడుపు ఉబ్బరంగా ఉండటం లాంటి లక్షణాలు ఉంటాయి. వెంటనే వైద్యులను సంప్రదించి వైద్య సహాయం తీసుకోవాలి. నిర్లక్ష్యం చేస్తే రోగి ప్రాణాలకు అపాయంతో పాటు, ఇతరులకు సైతం వ్యాధి సోకే ప్రమాదం ఉంది.

డెంగీ లక్షణాలు...

అధికజ్వరం, చలి, ఆకలి మందగించడం, వాంతులు, భరించలేని తలనొప్పి, కీళ్ల నొప్పులు, నీరసం డెంగీ వ్యాధి లక్షణాలు. వ్యాధి తీవ్రమైతే చర్మం పైన దద్దుర్లు, బ్లీడింగ్ అవడం, బీపీ తగ్గిపోవడం, ప్లేట్‌లెట్స్ పడిపోవడం లాంటి లక్షణాలుంటాయి. వెంటనే హాస్పిటల్‌కు వెళ్లి వైద్యుల సహాయం తీసుకోవాలి. ప్రభుత్వాసుపత్రుల్లో డెంగీ, మలేరియా, టైఫాయిడ్లకు ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తారు. మందులు కూడా ఉచితంగా అందుబాటులో ఉంటాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

ఇళ్లలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి, వాటర్ డ్రమ్స్, ఫ్రిజ్ వెనుక బాక్సులో, రుబ్బురోలు, తాగి పడేసిన కొబ్బరిబొండాలు, పాత టైర్లు, పాత డబ్బాలు, కవర్లు, వాటర్, టీ గ్లాసులు, మొక్కల కింద ప్లేట్లు, పాతసామాన్లు తదితర వస్తువుల్లో ఉండే నీటి నిల్వలను వెంటనే ఖాళీ చేయాలి. ఈ విధంగా దోమలు గుడ్లుపెట్టేందుకు అవకాశం ఉన్న అన్ని ప్రదేశాలను శుభ్రం చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల దోమల వ్యాప్తిని అరికట్టి రోగాలకు అడ్డుకట్ట వెయ్యొచ్చు.

రూ.5.24 కోట్లతో డ్రైనేజీలు, పంటకాలువల మరమ్మతులు

- రూ.5.24 కోట్లతో డ్రైనేజీలు, పంటకాలువల మరమ్మతులు
- ఎమ్మెల్యే బుద్ధప్రసాద్



అవనిగడ్డ: నియోజకవర్గంలో రూ.5.24 కోట్లతో యుద్ధప్రాతిపదికన డ్రైన్లు, పంటకాలువలకు మరమ్మతులు చేయనున్నట్లు శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. అయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ గత ఐదేళ్లలో డ్రైన్లు, పంటకాలువల్లో కనీసం గుర్రపుడెక్క కూడా తొలగించకపోవడం వల్ల కొద్దిపాటి వర్షానికే పంటపొలాలు ముంపునకు గురై రైతులు నష్టపోవాల్సి వచ్చిందన్నారు. నియోజకవర్గ రైతుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లగా సత్వరమే పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసినట్టు చెప్పారు. ఈ నిధులతో షార్ట్ టెండర్లు పిలిచి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. నిధుల మంజూరులో జిల్లా కలెక్టర్ బాలాజీ సంపూర్ణ సహకారం అందించారని తెలిపారు. ఈ నిధులతో నియోజకవర్గంలో రూ.2.94 కోట్లతో 13 డ్రైనేజీ పనులు, రూ.2.30 కోట్లతో పంట కాలువలకు మరమ్మతు పనులు చేపట్టనున్నట్టు చెప్పారు. రానున్న రోజుల్లో పూర్తిస్థాయిలో సాగునీరు అందించడంతో పాటు ఎక్కడా పంట ముంపునకు గురికాకుండా చర్యలు తీసుకుంటున్నట్టు బుద్ధప్రసాద్ తెలిపారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులు



డి.రాజలక్ష్మి విజయ్



ఆర్.నేహాశ్రీ



జె.యశ్విని



వి.శ్రీజ



ఎం.చంద్రహాస్



ఎస్.శ్రీవల్లిక



జ్యోత్స్న



జొన్నాల సాయిజాహ్నవి



గరికముక్కు ప్రవీణ్



కోసూరు శ్రియ

అవనిగడ్డ: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు జీఎస్‌బీ గోపాల్ తెలిపారు. డి.రాజలక్ష్మి విజయ్, ఆర్.నేహాశ్రీ, జె.యశ్విని, వి.శ్రీజ, ఎం.చంద్రహాస్, ఎస్.శ్రీవల్లిక నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్టు చెప్పారు. ఈ సందర్భంగా వారిని హెచ్‌ఎంతో పాటు పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన జ్యోత్స్న

ఘంటసాల: ఘంటసాల మండలంలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన కె.జ్యోత్స్న ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. ఘంటసాల జెడ్పీ హైస్కూల్‌కు చెందిన జ్యోత్స్న పదవ తరగతిలో 600 మార్కులకు 568 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు హెచ్‌ఎం శ్రీరంగవల్లి తెలిపారు. ఈ సందర్భంగా జ్యోత్స్నను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

ట్రిపుల్ ఐటీలో మండల విద్యార్థులకు సీట్లు

కృత్తివెన్ను: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తూ ఉత్తమ ప్రతిభ చూపిన ఇద్దరు విద్యార్థులు నూజివీడు ట్రిపుల్ ఐటీ కళాశాలలో ఉచితంగా సీట్లు సంపాదించినట్లు ఎంఈవో ప్రసాదరావు తెలిపారు. ఇటీవల జరిగిన పదవ తరగతి పరీక్షలలో మండలంలోని చినగొల్లపాలెం మెయిన్ ఉన్నత పాఠశాలకు చెందిన జొన్నాల సాయి జాహ్నవి (583) లక్ష్మీపురం ఉన్నత పాఠశాలకు చెందిన గరికముక్కు ప్రవీణ్ (574) మార్కులు సాధించారు. వీరిరువురు నూజివీడు ట్రిపుల్ ఐటీ కళాశాలలో ఉన్నత చదువులకు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. సీట్లు పొందిన విద్యార్థులను స్థానిక పెద్దలు, ఉపాధ్యాయులు, తల్లితండ్రులు అభినందించారు.

నంగేగడ్డ బాలికకు ట్రిపుల్ ఐటీ సీటు

నాగాయలంక: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌లో చదివి 2024-పదో తరగతి ఫలితాల్లో 571 మార్కులు పొందిన బాలిక కోసూరు శ్రియ (నంగేగడ్డ గ్రామం) ఒంగోలు ట్రిపుల్ ఐటీ కళాశాలలో సీటు సాధించినట్లు ఇన్‌చార్జి హెచ్‌ఎం పీవీఎస్‌వీ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా శ్రియను పాఠశాల విద్యాకుటుంబం తరపున పలువురు అభినందించారు.

19న చెరువుల వేలం

పెడన: పురపాలక సంఘ పరిధిలోని నాలుగు చెరువులను రెండు సంవత్సరాల పాటు లీజుకు ఇచ్చేందుకు ఈ నెల 19న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి.వెంకటరామయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెడనలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పక్కన కొత్త చెరువు, గుడివాడ రోడ్డులోని తాత్కాలిక డంపింగ్ యార్డు పక్కన తామర చెరువు, టీడీపీ పాలెంలోని వాటర్ వర్క్స్ పక్కన కొలుకుల వారి చెరువు, పదో వార్డులోని మల్లి చెరువులలో చేపలు పెంచుకుని పట్టుకునేందుకు సర్వ హక్కులు కలిస్తూ రెండేళ్లు లీజుకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. సాల్వెన్సు, డిపాజిట్ల వివరాలు మున్సిపల్ కార్యాలయంలో నోటీసు బోర్డులో చూసుకోవాల్సిందిగా సూచించారు.

18 మున్సిపల్ దుకాణాలు అద్దెకు...

పట్టణంలో ఖాళీగా ఉన్న 18 మున్సిపల్ దుకాణాలను ఆయా రిజర్వేషన్ల ప్రకారం అద్దెకు ఇస్తామని మున్సిపల్ కమిషనర్ బి.వెంకటరామయ్య తెలిపారు. మహిళా వాణిజ్య సముదాయంలో ఆరు, శ్రీ మహాత్మ గాంధీ షాపింగ్ కాంప్లెక్స్‌లో మూడు, బంటుమిల్లి రోడ్డు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో రెండు, పాత కూరగాయల మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఏడు ఖాళీలున్నాయన్నారు. మహిళ, జనరల్, ఎస్సీ, ఎస్టీల వారీగా ఆయా దుకాణాలు కేటాయిస్తామన్నారు. ఏ దుకాణం ఎవరికి రిజర్వేషన్ అనే వివరాలు మున్సిపల్ కార్యాలయంలోని నోటీసు బోర్డులో చూడాల్సిందిగా సూచించారు. పూర్తి వివరాలకు మున్సిపల్ కార్యాలయంలోని సంబంధిత సిబ్బందిని కలిసి తెలుసుకోవాలని కమిషనర్ తెలిపారు.

వినోదాత్మక చిత్రం డార్లింగ్ వై దిస్ కొలవరి

లబ్బీపేట(విజయవాడతూర్పు): భార్యాభర్తల మధ్య జరిగే గొడవను వినోదాత్మకంగా మలిచిన చిత్రం డార్లింగ్ వై దిస్ కొలవరి అని చిత్ర కథానాయకుడు ప్రియదర్శి అన్నారు. ఈ నెల 19న చిత్రం విడుదల కానుండటంతో ఆ సినిమా యూనిట్ సభ్యులు ప్రమోషన్‌లో భాగంగా శుక్రవారం నగరానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఎంజీ రోడ్డులోని ఓ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రియదర్శి మాట్లాడారు. దర్శకుడు అశ్విన్ రామ్ చెప్పిన కథ విని, వెంటనే హీరోగా నటించడానికి ఒప్పుకున్నట్లు తెలిపారు. కుటుంబ సమేతంగా ఈ చిత్రాన్ని చూడవచ్చని, అసభ్యకరమైన సన్నివేశాలు ఏవీ చిత్రంలో ఉండవన్నారు. సమావేశంలో హీరోయిన్ నభానటేష్, దర్శకుడు అశ్విన్ రామ్, హాస్యనటుడు కృష్ణతేజ, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మచిలీపట్నంటౌన్: నగరంలోని 11 కేవీ టౌన్-2, 11 కేవీ ఇనుగుదురుపేట, 11 కేవీ ప్రభుత్వాసుపత్రి లైన్ల మరమ్మతుల కారణంగా నగరంలో ఈ నెల 13వ తేదీ శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతున్నట్లు విద్యుత్‌శాఖ ఈఈ ఎం.భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు ఈడేపల్లి, పంచాయతీరాజ్ కాలనీ, నారాయణపురం, పంబలగూడెం, టెంపుల్ కాలనీ, మేదర కాలనీ, శారదానగర్, కాలేఖాన్‌పేట, చింతగుంటపాలెం, దేశాయిపేట, సుకర్లాబాద్, ఇంగ్లిషుపాలెం, బచ్చుపేట, రామానాయుడుపేట, పరాసుపేట, దిమ్మలసెంటర్, ఎన్జీవో కాలనీ, విశ్వబ్రాహ్మణ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

రోడ్లపై పశువులను వదిలితే క్రిమినల్ చర్యలు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలో పశువులను రోడ్లపై వదిలే యజమానులపై క్రిమినల్ ప్రాసిక్యూషన్ చర్యలు తీసుకుంటామని కమిషనర్ సీహెచ్ వీవీఎస్ బాపిరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పశు యజమానులు వారి పశువులను నగరంలోని రోడ్లపై వదలటం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి ఎంతోమంది గాయాలపాలై ప్రాణాలు కూడా కోల్పోయారన్నారు. దీనికి పశువుల యజమానుల బాధ్యతారాహిత్యమే కారణమని, ఇది తీవ్ర నేరమని అన్నారు. పశువుల యజమానులకు అనేక పర్యాయాలు సమావేశాలు ఏర్పాటు చేసి వారి పశువులను రోడ్లపై వదలవద్దని హెచ్చరించినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పెడచెవిన పెడుతున్నారన్నారు. ఇకపై యజమానులు పశువులను రోడ్లపైకి వదిలితే ఎలాంటి నోటీసులు జారీ చేయకుండానే తమ సిబ్బంది ఆ పశువులను స్వాధీనం చేసుకోవడమే కాక, పశువుల యజమానులపై క్రిమినల్ ప్రాసిక్యూషన్ చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. దీనికి సంబంధించిన న్యాయ వివాదాలు మచిలీపట్నం కోర్టు పరిధికి వర్తిస్తాయన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ప్రయోజనాలెన్నో



పులిగడ్డ(అవనిగడ్డ): ప్రకృతి వ్యవసాయం అవలంబించడం ద్వారా నాణ్యమైన దిగుబడులతో పాటు మంచి ఆదాయం పొందవచ్చని ఉద్యాన శాఖాధికారి రమేష్ అన్నారు. మండల పరిధిలోని పులిగడ్డ పంచాయతీ కార్యాలయం వద్ద ఉద్యాన శాఖ, వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం రైతు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఉద్యాన శాఖాధికారి రమేష్ మాట్లాడుతూ ఉద్యాన పంటలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీలను వివరించారు. ఘంటసాల కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ మంజు మాట్లాడుతూ ఖరీఫ్ సాగులో తీసుకోవాల్సిన మెలకువలను రైతులకు వివరించారు. అనంతరం సర్పంచ్ దాసరి విజయకుమార్ రైతులకు 13 రకాల కూరగాయలున్న మినీ కిట్లను రైతులకు అందించారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకురాలు సౌమ్య, ఆగ్రో ఆయిల్ పాం కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

కొండలమ్మ సన్నిధిలో వేలం

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి ఆలయ సన్నిధిలోని వివిధ హక్కులను పొందేందుకు శుక్రవారం ఈఓ కానూరి సురేష్ వేలం పాట నిర్వహించారు. శానిటేషన్ సరుకుల సరఫరాను మచిలీపట్నంకు చెందిన శ్రీ వెంకటేశ్వర జనరల్ స్టోర్స్ వారు దక్కించుకున్నారని ఈఓ తెలిపారు. అమ్మవారి సన్నిధిలో ఫొటోలు తీసుకునే హక్కు వేలంకు ఎవరూ రాని కారణంగా వాయిదా వేసినట్లు సురేష్ తెలిపారు.

రోగులకు సకాలంలో వైద్యసేవలందించాలి

ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్



కృత్తివెన్ను మండలం చినపాండ్రాక పీహెచ్‌సీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

కృత్తివెన్ను: వివిధ రకాల అనారోగ్య సమస్యలతో ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగుల పట్ల వైద్యులు, సిబ్బంది సహృదయంతో మెలగాలని వారికి కావాల్సిన వైద్య సహాయాన్ని సకాలంలో అందించాలని పెడన శాసన సభ్యుడు కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. ఆయన శుక్రవారం మండల పరిధిలోని చినపాండ్రాక పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు హాస్పిటల్‌లో వైద్యుల కొరత ఉందని, దీని కారణంగా అధికశాతం మంది గర్భిణులు జిల్లా కేంద్రమైన మచిలీపట్నం వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాల్సి వస్తోందని తెలిపారు. రోగులకు అవసరమైన మందుల ఇండెంట్ కూడా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమస్యలను ఉన్నతాధికారులకు వివరించి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే కాగిత హామీ ఇచ్చారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైందని ఈ సమయంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు.

కోలాహలంగా ఉర్వేళమ్మకు ఆషాఢసారె



ఉర్వేళమ్మకు గ్రామస్తులు సమర్పించిన ఆషాఢ సారె

భావదేవరపల్లి(నాగాయలంక): టీటీడీ ధార్మిక పరిషత్ సౌజన్యంతో ఆషాఢమాసం పురస్కరించుకుని గ్రామంలోని స్థానిక గ్రామదేవత ఉర్వేళమ్మకు అవనిగడ్డ సబ్‌డివిజన్ సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామస్తులు కోలాహలంగా ఆషాఢ సారెను సమర్పించారు. తొలుత గ్రామంలోని శ్రీఅన్నపూర్ణదేవి సమేత శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం నుంచి ఉదయం 10 గంటలకు అధిక సంఖ్యలో గ్రామస్తులు, మహిళలు చేరుకున్నారు. అక్కడి నుంచి ఆషాఢ సారె పళ్లాలతో గ్రామంలోని ప్రధాన వీధుల వెంట ఊరేగింపు నిర్వహించారు. తదుపరి గ్రామ శివారు లోని ఉర్వేళమ్మ గుడికి చేరుకుని గ్రామ దేవతకు మహిళలు సామూహికంగా చీరలు, రవిక ముక్కలు, గాజులు, పసుపు, కుంకుమలు, పండ్లు, మిఠాయిలతో కూడిన సారెను భక్తి శ్రద్ధలతో సమర్పించారు. మహిళలు ఆషాఢ సారె భక్తి గీతాలతో అలరించారు. ఫౌండేషన్ అవనిగడ్డ సబ్ డివిజన్ కన్వీనర్ ఎస్.సుబ్బారావు, ధర్మప్రచారక్ బచ్చు సీతారామ్, మండల కన్వీనర్ ఎం.వెంకటేశ్వరరావు, స్థానిక ఆలయాల ధర్మకర్తలు పూషడపు నిరంజనరావు, భోగాది విశ్వేశ్వరరావు, గ్రామ ప్రముఖులు మెండు సాయిరామ్, ముమ్మారెడ్డి వెంకటేశం, బసవారావు, అర్జా సుధాకర్, చందు మురళి తదితరులు పాల్గొన్నారు.

15న శ్రీవాసవీ కన్యకాంబ ఆలయంలో...

నాగాయలంక: మండల ఆర్యవైశ్య సంఘం, శ్రీవాసవీ సేవాదళ్ యూత్ ఆధ్వర్యంలో స్థానిక పార్వతీసమేత కన్యకా పరమేశ్వరీ సమన్విత నగరేశ్వరస్వామి ఆలయంలో 15వ తేదీన విశేష ఆషాఢ పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు శుక్రవారం తెలిపారు. గణపతి సచ్చిదానంద స్వామీజీ, కె.భానుప్రసాద్ దివ్యమంగళ ఆశీస్సులతో సాయంత్రం 4గంటలకు లక్ష మల్లెలతో విశేషార్చన, తదుపరి పార్వతీదేవి, కన్యకాపరమేశ్వరికి ఆర్యవైశ్య సంప్రదాయ రీతిలో ఆషాఢ సారెను సమర్పిస్తామని తెలిపారు. గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

చాముండేశ్వరిగా దర్శనమిచ్చిన వారాహి అమ్మవారు



1008 నిమ్మకాయలతో చాముండి అలంకారంలో వారాహి అమ్మవారు

నాగాయలంక: స్థానిక కృష్ణానదీ తీరం శ్రీకనకదుర్గమ్మ ఆలయంలోని శ్రీవారాహి అమ్మవారి ఆషాఢ గుప్త నవరాత్రుల ఉత్సవంలో భాగంగా శుక్రవారం అమ్మవారు చాముండేశ్వరీ దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా అమ్మవారిని 1008 నిమ్మకాయలతో విశేషార్చన, అలంకారం గావించారు. వారాహి దీక్షధారణ చేపట్టిన ఆలయ అర్చకులు ముదునూరి శ్రీనివాసశాస్త్రి, ముదునూరి అచ్యుత శేఖరశర్మ బ్రహ్మత్వంలో తెల్లవారు జామున వారాహిదేవి అలంకారంలోనే అమ్మవారికి శాస్త్రోక్తంగా కుంకుమ పూజతో ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. చాముండేశ్వరి పూజా క్రతువులో ఎం.శ్రీనివాసరావు, కళావతి దంపతులు పీటలపై కూర్చున్నారు. భక్తులు అధికసంఖ్యలో ఆలయానికి చేరుకుని చాముండిగా కొలువైన వారాహి, ఆలయంలో కనకదుర్గమ్మ అమ్మవార్లను దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కనకదుర్గమ్మను కూడా నిమ్మకాయలతో ప్రత్యేక అలంకరించారు. అనంతరం మంత్ర పుష్ప నీరాజనాలు సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీరామ క్షేత్రం కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, ఉప్పల లీలా కృష్ణప్రసాద్(బుజ్జి), బోయపాటి రాము, మహిళలు, కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

శాకంబరీదేవిగా దర్శనమిచ్చిన వారాహి దేవి



కె.కొత్తపాలెం(మోపిదేవి): మండలంలోని కె.కొత్తపాలెం గ్రామంలో ఉన్న శ్రీ దుర్గా కోటేశ్వర స్వామి వారి దేవస్థానంలో వారాహి నవరాత్రోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. అందులో భాగంగా శుక్రవారం ఉదయం ఆలయ అర్చకుడు విద్యాసాగర్ శర్మ బ్రహ్మత్వంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, పండ్లతో శాకంబరీ దేవిగా అలంకరించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్నారు.

యాళ్లమ్మ అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించిన మహిళలు



కోడూరు: మండలంలోని పోటుమీద గ్రామంలో ఉన్న యాళ్లమ్మ, ముత్యాల అమ్మవార్లకు మహిళలు ఆషాఢ సారెను సమర్పించారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామస్తులు సారెను ఊరేగింపుగా తీసుకువచ్చారు. పసుపు, కుంకుమ, చీర, గాజులు, పూలను అమ్మవార్లకు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవార్లకు ఆషాఢ సారె సమర్పించడం వల్ల సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండుతాయని పండితులు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

కోనేరుసెంటర్: గ్రామీణ ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల పూర్తి అవగాహన కలిగివుండాలని మచిలీపట్నం మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ అన్నారు. మండల పరిధిలోని చిన్నాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పలు గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగిస్తూ శుక్రవారం ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలుషిత నీరు తాగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి సాయి సుస్వర మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జిల్లా ఆరోగ్య విస్తరణాధికారి బి.సాంబశివారెడ్డి మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చెక్కా లక్ష్మి, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీలు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

వరుణుడి కరుణ కోసం ఎదురుతెన్నులు

- పట్టిసీమ నీరు చివర భూములకు అందేనా?
- అన్నదాతా సుఖీభవ సాయం కోసం వేచి చూస్తున్న రైతులు



లంకపల్లిలో సాగునీరు లేక ఎండిపోయిన కాల్వను చూపుతున్న రైతు

లంకపల్లి(ఘంటసాల): వ్యవసాయ పనులు ప్రారంభించడానికి సమయం దాటిపోతుండటంతో వరుణుడి కరుణ కోసం రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. కనీసం సాగునీరు కూడా సకాలంలో రాకపోవడంతో వ్యవసాయ పనులు ఎలా ప్రారంభించాలా అంటూ ఆందోళన చెందుతున్నారు. వర్షాలు కురిసే పరిస్థితి, సాగునీరు వచ్చే పరిస్థితి లేకపోవడంతో వరి పంట వేయడానికి సమయం దాటిపోతుండటంతో పొలాల్లో బోర్లు ఉన్న రైతులు వెద సాగు చేస్తుండగా, మరికొంతమంది నారుమడులు పోసుకుంటున్నారు. ఎంత చేసినా వరుణుడు కరుణించకపోయినా, సాగు నీరందక పోయినా తమ ప్రయాస వ్యర్థమే అంటూ పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు ప్రభుత్వం రైతులకు ఇస్తానన్న అన్నదాతా సుఖీభవ పథకం ఇస్తే వ్యవసాయ పనులకు ఉపయోగపడతాయని అంటున్నారు.

అవనిగడ్డ నియోజకవర్గం పరిధిలోని ఘంటసాల మండలం లంకపల్లి, దాలిపర్రు, పూషడం, ఎండకుదురు, చల్లపల్లి మండలం మాజేరు గ్రామాల్లో చివరి భూములైన సుమారు 5 వేల ఎకరాలు వీరంకిలాకు సెక్షన్ భీమనది చానల్ ద్వారా వచ్చే సాగునీటిపై ఆధారపడి వ్యవసాయం చేస్తుంటారు. కాని కాల్వల్లో నేటివరకు చుక్క నీరు రాకపోవడంతో ఈ ఏడాది సాగుపై రైతులు ఆందోళన చెందుతున్నారు. బోర్లు ఉన్న రైతులు మాత్రం సుమారు 20 ఎకరాల వరకు నారుమడి పోసి వరుణుడి కరుణ కోసం, సాగునీరు కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. లంకపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు మాట్లాడుతూ గత ఏడాది జూన్ నాటికి ప్రభుత్వం రైతు భరోసా అందించడంతో పనులు ప్రారంభించగా జూన్ 28కి నారుమడి చేతికి రావడంతో పాటు నాట్లు వేయడం కూడా ప్రారంభించామన్నారు. కాని ఈ ఏడాది జూలై నెల గడుస్తున్నా నూతన ప్రభుత్వం రైతులకు ఇస్తానన్న అన్నదాత సుఖీభవ పథకం డబ్బులు రాకపోగా సాగునీరు కూడా రాలేదంటూ వాపోతున్నారు. ప్రభుత్వం పట్టిసీమ ద్వారా నీటిని విడుదల చేస్తున్నామని, రైతులు ఇబ్బందులు పడకుండా చివరి భూములకు వరకు సాగునీరందిస్తామని చెప్తున్నా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు సకాలంలో సాగునీరందించి వ్యవసాయ పనులు ప్రారంభించడానికి సహకరించాలని రైతులు కోరుతున్నారు.

సాగునీరు అందించాలి



గత ఏడాది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వడంతో పాటు సాగునీరు అందించడంతో నారుమడి చేతికి రావడమే కాక నాట్లు కూడా వేశాం. ఈ ఏడాది జూలై నెల వచ్చిన సాగునీరు లేకపోవడంతో నారుమడులు వేయలేని పరిస్థితి నెలకొంది. లంకపల్లి గ్రామానికి సాగునీరు వచ్చే విధంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ చర్యలు తీసుకోవాలి.

– మాదెం నాగరాజు, రైతు, లంకపల్లి

సాగునీరు లేక నారుమడి పోయలేదు



సాగునీరు వస్తే నారుమడి వేద్దామని ఆశించాను. సాగునీరు లేకపోగా కనీసం వర్షాలు కూడా కురవడం లేదు. ఈ నెలాఖరులోపైనా సాగునీరు వస్తుందో లేదో. కనీసం వర్షాలైనా పడాలని భగవంతుడిని కోరుకుంటున్నాను. ప్రభుత్వం పెట్టుబడి సాయం, సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలి.

– గువ్వాబత్తిన నాగరాజు, రైతు, లంకపల్లి